# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 6, డిసెంబర్ 2025


## అంతర్జాతీయ స్థాయిలో

# గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ ఏర్పాటు




- సింగరేణి విజన్ డాక్యుమెంట్ విడుదల
- 2047 నాటికి దీర్ఘకాలిక ప్రణాళికల రూపకల్పన
- 2030 నాటికి బహుముఖ వ్యాపార విస్తరణలు, భారీ అభివృద్ధి వ్యూహాలు
- 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి
- 5,850 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు

**జైపూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విజన్ 2047కు అనుబంధంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కూడా తన విజన్ 2030 2047 డాక్యుమెంట్‌ను ప్రకటించింది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్. బలరామ్ విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసి స్ఫూర్తిదాయకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, వివిధ విభాగాల ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తుతో పాటు రాష్ట్ర, దేశ అవసరాలకు అనుగుణంగా కంపెనీని బొగ్గు రంగంతో పాటు ఇతర రంగాల్లోకి పెద్ద ఎత్తున విస్తరింపజేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి భారీ ఎత్తున ప్రణాళికలు తయారు చేశామని, దేశవిదేశాల్లో కీలక ఖనిజరంగం లో ప్రవేశించడానికి సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు, విజన్ డాక్యుమెంట్‌లోని స్వల్ప, మధ్య కాలిక ప్రణాళికలో 2030 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాన అంశాలు ఈ విధంగా ఉన్నాయి. సింగరేణి సంస్థ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష ్యంగా పెట్టుకుంది. దీని కోసం ప్రస్తుత లీజు ప్రాంతంలోనే కాక, లీజుకు వెలుపల ఉన్న ప్రాంతంలోని కొత్త బ్లాకులను, వివిధ రాష్ట్రాలలోని కొత్త బ్లాకులను కూడా చేపట్టాలని నిర్ణయించింది. ప్రస్తుత 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదనను 4,400 మెగావాట్లకు పెంచాలని అందుకు అనుగుణంగా కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం 245.5 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థ 2030 నాటికి 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి లక్ష ్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా రాజస్థాన్‌లో అతి త్వరలోనే 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేయబోతుంది. రాష్ట్రంలోని పలు భారీ నీటి జలాశయాల పైన 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నది.ఎత్తైన ఓపెన్ కాస్ట్ దంపుల పైన 100 మెగావాట్ల పవన విద్యుత్తు ఉత్పత్తి కోసం ప్లాంట్లను ఏర్పాటు చేయబోతోంది.500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి లక్ష ్యంగా పెట్టుకున్న కంపెనీ

తొలి దశలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని

## మెను అమలు బాధ్యత

# ప్రధానోపాధ్యాయులదే

**ఉట్నూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త:**

మెనూ అమలు చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి అదిలాబాద్ జిల్లాల ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమ అధికారులు, డిప్యూటీ వార్డెన్ల సమావేశం ఉట్నూరు మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్ పిఎంఆర్‌సిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మార్మాట్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, నూతన మెనూ అమలులో చిన్నపాటి మిగతా 2లో..



## ఇంటి నిర్మాణానికి దాచిన డబ్బులు

# చోరీ

- ఇద్దరు అరెస్ట్, నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన సిసిసి నస్పూర్ ఎస్‌హెచ్‌ఓ యు.ఉపేందర్‌రావు

**నస్పూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న డబ్బులను దొంగిలించిన కేసును సిసిసి నస్పూర్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఎస్‌హెచ్‌ఓ యు. ఉపేందర్ రావు వెల్లడించారు. నస్పూర్ మండలం గాంధీనగర్‌కు చెందిన పురాణం రాంచందర్ కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఇంటి పక్కనే ఉన్న షెడ్డులో నివాసం ఉంటూ, ఇంటి పనుల కోసం రూ. 94,000 నగదును ఒక ఇనుప పెట్టెలో దాచుకున్నాడు. కాగా, గత నెల 30వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డులో చొరబడి ఆ డబ్బును అపహరించారు. బాధితుడు ఈనెల 1న ఉదయం లేచి చూసేసరికి డబ్బులు కనిపించకపోవడంతో వెంటనే సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు మిగతా 2లో..

# ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి



**తిర్యాని, డిసెంబర్4, ప్రభాతవార్త;**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. శుక్రవారం తిర్యాణి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు, రికార్డులను పరిశీలించి ఎన్నికల సంబంధిత విధులు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ దాఖలు దాదాపుగా పూర్తి అయినందున ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నామినేషన్లను పరిశీలించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల మిగతా 2లో..

# విద్యా భారతి పాఠశాలకు జాతీయస్థాయి అవార్డు

**– తాండూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**



2లో..

# ఈవిఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఈవిఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది పటిష్టమైన బందోబస్తు మిగతా 2లో..





## మెను అమలు బాధ్యతలు
# ప్రధానోపాధ్యాయులదే

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, దానిని డీడీల ఆధ్వర్యంలోని హామీల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన మార్పులు చేపడతామని తెలిపారు. మెనూ అమలు మానిటీరింగ్ కొరకు నూతన యాప్‌ను రూపొందించామని, దీని ద్వారా సులువుగా మెనూ అమలు తీరు పర్యవేక్షించవచ్చని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా నిరక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్లపై తగిన తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు విద్యార్థులు భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం ఒక క్రమ పద్ధతిలో మంచి అలవాట్లు చేసుకోవాలని ప్రతి విద్యార్థి మంచి అలవాట్లు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు అంబాజీ, రీజనల్ కోఆర్డినేటర్ అగస్టీన్, ఏసిఎంఓలు, బాలికల అభివృద్ధి అధికారినిలుమేశ్రం ఛాయా కోట్నాక శకుంతల ఏటిడబ్ల్యూఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి దాచిన డబ్బులు చోరీ

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్న ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ రావు దర్యాప్తు వేగవంతం చేశారు. సిసి టివి ఫుటేజీని పరిశీలించి నిందితులను గుర్తించారు. మంచిర్యాల ఒడ్డెర కాలనీకి చెందిన బోసు తరుణ్, ఉప్పల రాకేష్, సంజయ్ అలియాస్ చిన్ని ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. పోలీసులు బోసు తరుణ్, ఉప్పల రాకేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి చోరీ చేసిన సొత్తులో రూ. 70,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్ కోసం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ హెచ్ఓ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు సంజయ్ అలియాస్ చిన్ని పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## విద్యా భారతి పాఠశాలకు జాతీయస్థాయి అవార్డు

తాండూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. భారతదేశపు ప్రీమియం విద్యా పత్రిక అయిన ఎడ్యుకేషన్ టుడే వారు నిర్వహించిన సర్వేలో ఎడిట్ అవార్డుల ద్వారా దేశవ్యాప్తంగా అత్యుత్తమ పాఠశాలలను గుర్తించి వాటిలో విద్యా భారతి పాఠశాలను మొదటి స్థానంలో ఎంపిక చేశారు. బెంగళూరులోని ది తాజ్ యశ్వంతపూర్ లో పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ సౌమ్య దంపతులు అవార్డును అందుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ సురభి ఆగమ రావు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతమైన తాండూర్ మండల కేంద్రంలో విద్యా భారతి పాఠశాలను ప్రారంభించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఆంగ్ల విద్యా వ్యవస్థను ప్రారంభించి విద్యలో శ్రేష్టత కొత్త ప్రమాణాలను నెలకొల్పడం కోసం ఎన్నో మైలురాళ్లను అధిగమించి అందరి సహకారం, ప్రోత్సాహంతో పాఠశాలను నిర్వహిస్తున్నామన్నారు. డిజిటల్ లెర్నింగ్ అడ్వాన్స్ మెంట్ కేటగిరి సీబీఎస్ఈ పారామీటర్ ర్యాంకింగ్ కింద విద్యా భారతి పాఠశాలను ఎంపిక చేయడంతో పాటు జాతీయస్థాయిలో అవార్డు రావడం ఎంతో గర్వకారణం అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యా బోధన అందించడమే లక్ష్యమన్నారు.

## ఈవిఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టడంతో పాటు 24 గంటలు సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

250 మెగావాట్ల ప్లాంటును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మణుగూరుకు సమీపంలోని పగిడేరు వద్ద ప్రయోగాత్మకంగా విజయవంతమైన జియో థర్మల్ ప్లాంటు వద్ద 200 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని, ప్రణాళికలు రూపొందించారు. ఇది కాక ఎఫ్.డి.ఆర్.ఈ హైబ్రిడ్ ఆర్టీసి విభాగాలలో కలిపి మరో 1,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలని, 700 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టంలను వివిధ సోలార్ ప్లాంట్ల వద్ద ఏర్పాటు చేయాలని కూడా ప్రణాళికలు రూపొందించింది. దీనితో మొత్తం మీద 2029-30 నాటికి సింగరేణి 5.85 గిగా వాట్ల(5,850 మెగావాట్ల) పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్‌లో స్పష్టం చేసింది. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు, థర్మల్ విద్యుత్, పవన విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాలలోనే కాకుండా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించిందని, ఈ మేరకు దేశ విదేశాల్లో ఈ రంగంలో గల అవకాశాలను పరిశీలించడం కోసం ప్రఖ్యాత పరిశోధన సంస్థలతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుందని, రాగి, బంగారం అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందని ఇక ముందు కూడా ఈ రంగంలో దూకుడుగా ముందుకు పోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడానికి సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ (జి.ఎస్.ఎల్)అనే అనుబంధ సంస్థ ఏర్పాటు విజన్ డాక్యుమెంట్‌లో సూచించారు. దీర్ఘకాలిక ప్రణాళిక విజన్ 2047లో లక్ష్యాలుకాగా సింగరేణి సంస్థ తన దీర్ఘకాలిక ప్రణాళిక 2047లో అవసరమయ్యే థర్మల్ విద్యుత్తును, 5,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును, 2815 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ను, 1,500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను, 500 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని, మొత్తం మీద 25 గిగావాట్ల పరిమాణంలో వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్ లో పేర్కొంది. విజన్ డాక్యుమెంట్ లో పేర్కొన్న పలు ఇతర ప్రాధాన్యత అంశాలు సింగరేణి రక్షణతో కూడిన ఉత్పాదకత గల ఆధునిక టెక్నాలజీలతో బొగ్గు ఉత్పత్తులు సాధిస్తుంది. పర్యావరణహిత, మైనింగ్ చేపడుతూ, జల సంరక్షణకు, జీవ వైవిధ్యానికి, వాతావరణ కాలుష్య నివారణకు పాటుపడుతుంది. పూర్తి పారదర్శకంగా నీతి, నిజాయితీలతో ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని మైనింగ్ జరుగుతుంది. వాతావరణ కాలుష్య నివారణ కోసం కోల్ వాషరీలను ఏర్పాటు చేస్తుంది. కోల్ గ్యాసిఫికేషన్, లిక్విఫికేషన్ ప్రణాళికలు అమలు చేస్తుంది. కర్బన ఉద్గారాలను అదుపు చేస్తూ వాటితో ఉపయోగకర పదార్థాలను తయారుచేస్తుంది. వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా సౌర విద్యుత్తు, పవన విద్యుత్తు, ఫ్లోటింగ్ సోలార్ వంటి ప్లాంట్లు ఏర్పాటుచేస్తుంది. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ రంగంలో ప్రవేశిస్తుంది. బొగ్గు నుంచి రసాయనాలు, కోల్ గ్యాసిఫికేషన్ ఆధారిత ఉత్పత్తులు సాధిస్తుంది. మూతపడిన గనుల్లో రిక్లేమేషన్ పనులతో పాటు, అక్కడ ఉన్న నీటి వసతులను పంప్డ్ హైడ్రో ప్రాజెక్టుల కోసం వినియోగిస్తుంది. మెటల్ మైనింగ్ రంగంలో అన్వేషణ విభాగపు సేవలు అందిస్తుంది. అనేక కార్మిక ప్రయోజన, ప్రజాహిత చర్యలు నూతన టెక్నాలజీకి అనుగుణంగా ఆటోమేషన్ పద్ధతులకు తగిన విధంగా ఉద్యోగులకు శిక్షణలు ఇవ్వడం. ఉద్యోగులకు గట్టి ఆరోగ్య రక్షణ, భద్రత, సంక్షేమ కార్యక్రమాలు. సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాల పెంపుదల. మహిళా ఉద్యోగుల సేవలను ఓపెన్ కాస్ట్ మరియు భూగర్భగనుల్లోని కీలక విభాగాల్లో వినియోగించడం వంటి చర్యలను విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు.

# బెల్లంపల్లిలో ఎన్నికల సందర్భంగా ముందస్తు ముమ్మర తనిఖీలు

బెల్లంపల్లి, డిసెంబర్ 05, ప్రభాతవార్త



రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ఝా ఆదేశానుసారం మంచిర్యాల డిసిపి భాస్కర్, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ పర్యవేక్షణలో బెల్లంపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హానోక్ శుక్రవారం సాయింత్రం బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు టీ అండర్ బ్రిడ్జి పైన సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టడం జరిగింది. సాధారణ సార్వత్రిక సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా ముందస్తుగా ఎలాంటి గొడవలు జరగకుండా ఈ తనికిలు నిర్వహించడం జరిగింది. ఎన్నికల ప్రక్రియ మొదలుకొని ఫలితాల వెల్లడించే వరకు ప్రతిరోజు ఈ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు పోలీసు శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరించాలని చట్టాన్ని ఉల్లంఘించే పనులు ఎవరైనా చేస్తే ఉపేక్షించకుండా వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అసాంఘిక శక్తులకు ఎవరు తావివ్వొద్దని గుర్తు తెలియని అనుమానిత వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఆపద సమయంలో కానీ అత్యవసర సమయంలో 100 నెంబర్ కు సమాచారం అందిస్తే తమ సిబ్బంది అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరించడం జరుగుతుంది.

# ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

మహిళా సమాఖ్య భవనం నిర్వహణ, మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలపై సమీక్షి ంచి పొదుపు సంఘాల ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూత పథకాలను సక్రమంగా అమలు చేస్తూ మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికల సంక్షేమంలో భాగంగా సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలని, గర్భిణులు గర్భస్థ సమయంలో పాటించవలసిన జాగ్రత్తలను వివరించాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పివిటిజి (ముఖ్యంగా ప్రమాదంలో ఉన్న గిరిజన సమూహాలు) లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు. మండలంలోని రాళ్ల కన్నెపల్లి గ్రామంలో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. మన ఊరు మన బడి పనుల పురోగతిని సమీక్షి ంచి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సందర్శించి పనుల నాణ్యత, పురోగతిని పరిశీలించారు. నిరుపేదలకు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు సమన్వయంతో పని చేసి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిర్యాని ఎంపిడివో మల్లేష్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

# దివ్యాంగుల ఉన్నతికి సింగరేణి సంపూర్ణ సహకారం

*** శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ * ఘనంగా దివ్యాంగుల దినోత్సవ వేడుకలు**

నస్పూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త

దివ్యాంగ పిల్లల్లో ధైర్యాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, వారి ఉన్నతికి సింగరేణి సంస్థ తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ ఏరియా వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. శ్రీరాంపూర్ పరిసర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల నుండి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు ఈ కార్యక్రమంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మునిగంటి శ్రీనివాస్, క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన



మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని కొనియాడారు. ప్రతి విద్యార్థిలోనూ ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికి తీయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజంలో దివ్యాంగ పిల్లలు తమ సామర్థ్యాలను నిరూపించుకునేలా వారికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి వారిని ఉన్నత శిఖరాలకు చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో రన్నింగ్ రేస్, త్రో బాల్ వంటి వివిధ విభాగాలలో పోటీలను నిర్వహించారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, స్పోర్ట్స్ చీఫ్ కోఆర్డినేటర్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, స్పోర్ట్స్ హననరీ సెక్రటరీ పాల్ సృజన్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## మొదటి విడత ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల తొలి దశ ర్యాండమైజేషన్ పూర్తి

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పర్యవేక్షణలో**

**పకడ్బందీగా సాగిన ర్యాండమైజేషన్ ప్రక్రియ**

నిర్మల్ పట్టణం, డిసెంబర్ 05, ప్రభాతవార్త

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. మొదటి విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు తొలి దశ ర్యాండమైజేషన్ మండలాల వారిగా నిర్వహించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడినంత మంది పిఒ, ఓపిఓలను నియమించనున్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవసరానికి 20 శాతం అదనంగా అధికారులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు. దీనిద్వారా ఎన్నికల నిర్వహణలో అధికారుల కొరత తలెత్తకుండా ఉంటుందని అన్నారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య

## నామినేషన్ ప్రక్రియ సమర్ధవంతంగా చేపట్టాలి

జైపూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శుక్రవారం జైపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, అలాగే నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలన్నారు.స్వీకరించిన నామినేషన్ పత్రాలను ఎప్పటికప్పుడు టీ పోల్ నందు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సత్యనారాయణ, తహశీల్దార్ వనజ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

వేమనపల్లి, డిసెంబర్ 05, ప్రభాతవార్త

విద్యుత్ మరమ్మతు కారణంగా నీల్వాయి, వేమనపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వేమనపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఓ ప్రకటనలో తెలిపారు. వేమనపల్లి, రాజారం, ఒడ్డుగూడెం, సుంపుటం, జాజులపేట, ముక్కుడిగూడెం, కల్లంపల్లి, మామడ, నీల్వాయి కల్మలపేట, కేతనపల్లి, ముల్కలపేట, రాచర్ల, గొర్లపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్, మంగనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



## సైన్స్ వీక్‌లో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

రామకృష్ణాపూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త

సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో సైన్స్ వీక్‌లో భాగంగా శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించగా, విద్యార్థులు భారీగా హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వంటి విభాగాల్లో రూపొందించిన మోడళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పొన్నాల సుమన్, డైరెక్టర్ పొన్నాల వినయ్ విద్యార్థుల సృజనాత్మకతను అభినందించారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు, కొత్త ఆలోచనలకు అవకాశం కల్పించేందుకు ఈ ఎగ్జిబిషన్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

## బిజెపిలో పలువురు యువకుల చేరిక

**- కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్**

బెల్లంపల్లి, డిసెంబర్ 05, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలం విగామ్ గ్రామానికి చెందిన సాయి కిరణ్‌తో పాటు పలువురు యువకులు శుక్రవారం బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ సమక్షంలో బిజెపిలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరు వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పాలనను మెచ్చి పెద్ద ఎత్తున యువత బిజెపిలో చేరుతున్నారని గ్రామ స్వరాజ్యం బిజెపి తోనే సాధ్యమని పలువురు విశ్వసిస్తున్నారని ప్రజల విశ్వాసానికి అనుగుణంగా బిజెపి పని చేస్తుందని అన్నారు. బిజెపి లో చేరిన సాయి కిరణ్‌కు భారతీయ జనతా పార్టీ పూర్తిగా మద్దతు ఉంటుందని వారి గెలుపుకు పార్టీ కార్యకర్తలు కృషి చేస్తారని అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి భీమిని మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, బిజెపి జిల్లా కార్యదర్శి వైద్య శ్రీధర్ తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐబీ కేంద్రం నుంచి శబరిమలకు అయ్యప్ప స్వామి సైకిల్ యాత్ర

తాండూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :

మండలంలోని తంగళ్ళపల్లికి చెందిన బాణాల వంశీకృష్ణ అని అయ్యప్ప స్వామి శుక్రవారం సైకిల్ పై తాండూరు మండలం ఐబి కేంద్రం నుండి శబరిమలకు బయలుదేరారు. ఐబీ లోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలోని అయ్యప్ప స్వామి ఉపఆలయంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైకిల్ యాత్ర చేపట్టిన వంశీకృష్ణకు అతని కుటుంబ సభ్యులు, అయ్యప్ప స్వాములు స్వామియే శరణమయ్యప్ప అంటూ శరణు ఘోషతో ఐబి వరకు మంగళ హారతులతో వెళ్లి వీడ్కోలు పలికారు.



శబరిమలకు సైకిల్ పై బయలుదేరిన అయ్యప్ప స్వామి వంశీకృష్ణ

## లింగాపూర్ లో వాహనాల తనిఖీలు.

లింగాపూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త :

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లింగాపూర్ లో పోలీసులు నాకబంది నిర్వహించారు, వాహనాలను క్షుణాంగా పరిశీలించి అనుమానాలు ఉన్న వాహనాలను అదుపులోకి తీసుకొని విచారించినట్లు ఎస్సై గంగన్న తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు తనిఖీలు ఉంటాయి అని తెలపడం జరిగింది.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై గంగన్న

# పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం..

- డిసెంబర్ 7,8,9వ తేదీలలో జరిగే సీఐటియు రాష్ట్ర 5వ మహాసభలు జయప్రదం చేయండి
- లేబర్ కోడ్స్ రద్దుకై సీఐటీయూ పోరాటం
- గోడ ప్రతులు విడుదల చేసిన దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సిఐటి నాయకులు

**మంచిర్యాల, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం డిసెంబర్ 7,8,9 వ తేదీలలో జరుగుతున్న సీఐటియు రాష్ట్ర 5వ మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ,కార్మికుల సమస్యల పరిష్కరమే ధ్యేయంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం సీఐటీయూ.అని కేంద్రంలో నరేంద్రమోడీ బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ ను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దానికి సహకరించడం చాలా దారుణమని,బ్రిటిష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను రద్దు చేస్తూ, కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధంగా ఈ చట్టాలను తెచ్చారని,ఈ చట్టాలు అమలు జరిపి కార్మికులను బానిసలుగా మార్చడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వానికి అధిక ఆదాయం తీసుకొచ్చే హమాలీ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందని, ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటూ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందని, హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని, అర్హులైన నిరుపేద కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన పోరాటాలను, భవిష్యత్తు కార్యచరణను ఈ రాష్ట్ర మహాసభలలో చర్చించుకోవడం జరుగుతుందని తెలిపారు.కావున డిసెంబర్ 7వ తేదీన మెదక్ పట్టణంలో జరిగే ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజేశ్వరి సీఐటీయు జిల్లా సహాయ సహాయ కార్యదర్శి, ఏ.మోలాలి జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

## సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**ఆసిఫాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త:**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న సినిమా పోస్టర్‌నుఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి ఆవిష్కరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పిల్లల పార్క్ లో అమరవీరుల స్థూపం వద్ద సినిమాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సినిమా విడుదలై మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, గంధం శ్రీను, నిస్సార్ భాయ్, జీవన్, సినిమా టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శతాబ్ది వృద్ధురాలు మృతి

**సారంగాపూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త:**



మండలంలో శతాధిక వయస్సు దాటిన వృద్ధురాలు అబ్దుల్ వాజిద్ బీ (106) కన్నుమూశారు. స్వర్ణ గ్రామ వాస్తవ్యురాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది నాయనమ్మ అయిన వాజిద్ బీ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య కారణాలతో ఇటీవల అస్వస్థతకు గురైన ఆమె మృతి చెందారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలకు గ్రామస్తులు అందరు హాజరైనారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీసీ నాయకుడు

**సారంగాపూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త:**



చించోలి(బి) గ్రామనికి చెందిన బీసీ నాయకుడు చెన్నజి లక్ష్మణ్, అతని అనుచరులు శుక్రవారం జిల్లా జడ్పీటీసీ ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినారు. వారికి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పలు ప్రజాసంక్షేమ పథకాలు ఆకర్షితుడ్ని అయి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

## దాడి కేసులో నిందితుడు అరెస్టు

**తాండూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

మండల కేంద్రానికి చెందిన సాయి సృజన్ గౌడ్ పై దాడి చేసిన కేసులో కాయిత శ్రీ నిచల్ అనే యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఐబీ లో సృజన్ గౌడ్ తో కాయిత శ్రీ నిచల్ గొడవ పడి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అనంతరం విచారణ జరిపి అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. శ్రీ నిచల్ పై రౌడీ షీట్ ఓపెన్ చేయడం జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



దాడి కేసులో నిందితుడిని అరెస్టు చేసిన తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్



## బిజెపిలో చేరిన మండల నాయకులు

**సారంగాపూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త:**

మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోన్, నిర్మల్ రూరల్ మండల నాయకులు బిజెపి పార్టీలో చేరినారు. సోన్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు దాసరి శ్రీనివాస్, సుండి గంగయ్యలు, వారి అనుచరులు ఆ పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. నిర్మల్ రూరల్ తాంశ గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్‌తో పాటు పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. మహేశ్వర్ రెడ్డి పార్టీలో చేరినటువంటి నాయకులకు వారి అనుచర వర్గానికి బిజెపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జమాల్, శ్రీనివాస్, గంగాధర్, రాములు బక్కన్న, సాగర్, సుధాకర్, రవి నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నరేష్, బోనగిరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## జన్మదినం సందర్భంగా 6వ సారి రక్తదానం

**ఆదిలాబాద్, డిసెంబర్ 05, ప్రభాతవార్త:**



తమ జన్మదినం పురస్కరించుకొని కొందరు ఎలాంటి హంగు ఆర్భాటాలు వేడుకలు నిర్వహించకుండా సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన జర్నలిస్ట్ గాజరి శ్రీకాంత్ శుక్రవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రతి సంవత్సరం పుట్టినరోజు నాడు రక్తదానం చేయడం ఆనవాయితీగా వస్తుందని శ్రీకాంత్ తెలిపాడు. పుట్టినరోజు వేళ రక్తదానం చేయడం సంతోషంగా ఉందని, రక్తదానం చేయడం ఇది ఆరవ సారి అని పేర్కొన్నారు. అన్ని దానాలలో ప్రధానమైన దానం రక్తదానమని తెలిపాడు. రక్తదానం చేసి రక్తహీనులను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో సూరం తిరుపతి, తక్కల్ల సాయి రెడ్డి ఉన్నారు.


సుగుణక్క వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

## ఆత్రం సుగుణక్క వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

**ఉట్నూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త:**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఎన్నికల సిబ్బంది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో వాహన తనఖీల్లో అధికారులు ఎవరినీ విడిచిపెట్టడం లేదు. శుక్రవారం ఉట్నూర్ నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్న ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కుమురంభీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఉట్నూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఆమెను ఆపిన పోలీసులు వాహనంతో పాటు, ఆమె పర్సును కూడా వదలకుండా చెక్ చేశారు. ఈ క్రమంలో సుగుణక్క తన వాహనం దిగి పోలీసుల తనిఖీకి పూర్తిగా సహకరించారు. సుగుణక్క వాహనంతో పాటు ఆమె వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు తనిఖీ చేశారు.

## సర్పంచ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, డిసెంబర్ 05, ప్రభాతవార్త:**

ఉట్నూర్ గ్రామపంచాయతికి సర్పంచ్‌గా భాగ్యలక్ష్మికి గెల్పించాలని ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతి ఉండడంతో 15 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉండడంతో ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ భాగ్యశ్రీకి మద్దతుగా వాడా వాడాలో తిరిగి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌గా గెలిపిస్తే ఉట్నూర్ గ్రామపంచాయతిని ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానూలు, ప్రజలు పాల్గొన్నారు.





## బెల్లంపల్లి రైల్వే క్వార్టర్లను పరిశీలించిన రైల్వే డివిజనల్ ఇంజనీర్ అభిరామ్

**బెల్లంపల్లి, డిసెంబర్ 05, ప్రభాతవార్త**

బెల్లంపల్లి రైల్వే స్టేషన్ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను తక్షణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ అభిరామ్ పరిశీలించారు. మూడవ ప్లాట్ ఫారం,రెండో ప్లాట్ ఫారం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డివిజనల్ ఇంజనీర్ ఆదేశించారు. అంతేకాకుండా తాండూరు మండలం రేచిని రైల్వే స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సైడింగ్ ట్రాక్ మిషన్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట బెల్లంపల్లి రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఏ. గోపి, ఎస్ఈపిఓడబ్ల్యూ కృష్ణ ప్రసాద్, ఎస్ ఎస్ ఈ పీ వే ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## మంగళ శాసనాల వ్యాసరచన విజేతలకు బహుమతి ప్రదానం

**మంచిర్యాల,డిసెంబర్ 5, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ హైస్కూల్లో ప్రజ్ఞా వికాస్ మండలి ఆధ్వర్యంలో శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన వకృత్వం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వకృత్యం మొదటి బహుమతి మునజ్జ మరియం 9వ తరగతి స్లేట్ హైస్కూల్, రెండవ బహుమతి, కే హర్షిని పదవ తరగతి రేవేలేషన్ హైస్కూల్, వ్యాసరచనలో ఈ సుధీష్ణ పదవ తరగతి రెవేలేషన్ హైస్కూల్, రెండో బహుమతి టి సిరి చందన సెవెన్ హిల్స్ హైస్కూల్, ఈ నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. త్వరలో హైదరాబాదులో జరిగే ఫైనల్లో పాల్గొనబోతున్నారని, ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు తెలిపారు.

## సేకరించిన విరాళాలు అందజేత

**ఆదిలాబాద్, డిసెంబర్ 05, ప్రభాతవార్త:**



సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల అదిలాబాద్ ఎన్‌సిసి కాండేట్స్, 32 తెలంగాణ బెటాలియన్ ఆదేశాల మేరకు కళాశాల ఎన్‌సిసి అధికారి పుట్టా లక్ష్మణ్ ఆధ్వర్యంలో అదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విరాళాల సేకరణ నిర్వహించారు. సేకరించిన విరాళాలను సైనిక సంక్షేమ ప్రాంతీయ కార్యాలయంలో అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఐపి స్టాఫ్ ఆదిత్య, ఎన్‌సిసి కాండేట్స్, సీనియర్ అండర్ ఆఫీసర్ మాడవి సంతోష్ పాల్గొన్నారు.

## మిట్టపల్లి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు

**జైపూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు పి.మనోహర్ శుక్రవారం మండలంలోని మిట్టపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీంచి, నామినేషన్ కేంద్రల్లో నామినేషన్ ప్రక్రియను, రిజిస్టర్ మెయింటనెన్స్ సరిగా చేయాలని సూచించిన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ వనజ, ఎంపీవో శ్రీపతి బాపు రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సత్తాచాటాలి

**రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం - శ్రీరాంపూర్ చాయ్ పే చర్చలో బీసీ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్**

**నస్పూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా బీసీలు తమ సత్తా చాటాలని బీసీ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియం మైదానంలో నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, రాష్ట్రవ్యాప్తంగా 17 శాతం, మంచిర్యాల జిల్లాలో కేవలం 7 శాతం మాత్రమే ఇవ్వడాన్ని బీసీ సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. జిల్లాలో మొత్తం 306 పంచాయతీలకు గాను కేవలం 23 స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించడం, గ్రామస్థాయిలో బీసీలను రాజకీయంగా అణచివేయడమేనని మండిపడ్డారు. జరుగుతున్న శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే బీసీలకు చట్టబద్ధత ఉంటుందని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ప్రభుత్వాలు బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. బీసీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లినప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. మన ఓటు మనకే అనే నినాదంతో, అత్యధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాలను గెలుచుకోవడానికి కంకణబద్ధులై




పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పూదరి కుమార్, బీసీ సమాజ్ జిల్లా నాయకులు వేముల కిరణ్, నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల చంద్రయ్య, బీసీ సమాజ్ నాయకులు ఆడెపు సురేష్, తాటిపాముల సమ్మయ్య, ఎనగందుల వెంకటేష్, గాజుల సంపత్, చల్ల శ్రీనివాస్, వెయ్యికండ్ల శ్రీకాంత్, సూర్య కిరణ్, గుజ్జేటి నరేష్, పూదరి కృష్ణ, పొట్లబత్తిని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా కిట్స్ పంపిణీ

**లక్షెట్టిపేట, డిసెంబర్ 05, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట పట్టణంలో గల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా కిట్స్‌ను ఎస్ఐ గోపతి సురేష్ చేతుల మీదుగా శుక్రవారం రోజున విద్యార్థులకు అందించడం జరిగింది.. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... విద్యార్థులు నాసా ప్రాజెక్టుని స్పేస్ కాలనీ, వాయుపుత్రలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతరిక్షంపై చిన్న వయసులోనే అవగాహన పెంచే కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నేపథ్యంలో విద్యార్థులు కొత్త పరిజ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలని విద్యార్థులకు సూచించారు. భూమి నివాస యోగ్యం కానీ పరిస్థితులలో అంతరిక్ష వాతావరణంపై అవగాహన పెంచుకోవడం కోసం అవసరమని పేర్కొన్నారు. నాసా ప్రత్యేకంగా తయారుచేసి నటీ షర్ట్ పెన్స్ నోట్ బుక్స్ లను విద్యార్థులకు అందజేసి వారినిప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అశ్విని, పాఠశాల అకాడమిక్ డీన్ జి సుధీర్ విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు..ఇంత ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, జోనల్ ఏజీఎం అరవింద రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు ఎంతగానో అభినందించారు.

## దివ్యాంగులు తమ అన్ని హక్కులను పొందాలి

**- మండల విద్యాధికారి జి. శైలజ**

**లక్షెట్టిపేట, డిసెంబర్ 05, ప్రభాతవార్త**

దివ్యాంగులు తమకు ఉన్న హక్కులన్నింటినీ పొందాలని మండల విద్యాధికారి జి. శైలజ అన్నారు. శుక్రవారం రోజున పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ... జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కొరకు పటిష్ట చర్యలు ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. దివ్యాంగులకు ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలలో రిజర్వేషన్లను ఉపయోగించుకోవాలన్నారు. అన్ని రంగాలలో ఉన్నతి సాధించాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా భవిత కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. అర్హులైన దివ్యాంగులకు యుడిఐడి కార్డులను అందిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగుల హక్కుల గురించి అవగాహన కలిగేలా న్యాయ నిపుణులు, ఎన్జీవోలతో కలిసి ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని, దివ్యాంగులకు ఇటీవలి నిర్వహించిన క్రీడ పోటీలలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి శైలజతో పాటు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వేణుగోపాల్, భవిత కేంద్రం నిర్వాహకులు రమేష్, శంకర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయాలు

**బుజ్జగింపులు..బేరాసారాలు.. - నేడు ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు**

**తాండూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**




గ్రామ పంచాయతీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రెండో విడత సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసిన అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ గడువు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ముగియనున్నది. కొందరు ప్రధాన పార్టీల నాయకులు సర్పంచ్, వార్డు స్థానాలకు తమ అనుచరులతో నామినేషన్లు వేయించారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేయడంతో కార్యకర్తలలో అయోమయం నెలకొంది. దీంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు రంగంలోకి దిగి నామినేషన్ వేసిన అభ్యర్థులను తమ నామినేషన్లు ఉపసంహరించుకోవాలని బుజ్జగిస్తున్నారు. కొందరు అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణకునో చేపుతుండడంతో బేరాసారాలు చేస్తూ నామినేషన్ ఉపసంహరణకు శతవిధాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేషన్ వేసిన కొందరు అభ్యర్థులు ప్రధాన పార్టీ ముఖ్య నేతలను కలిసి మీరు నాకు మద్దతు ఇవ్వకుంటే వేరే పార్టీలో చేరుతామని కొందరు అభ్యర్థులు నేతలను బెదిరిస్తున్నారు. నామినేషన్ ఉపసంహరణ గడువు ముగిస్తే కానీ ఎవరు పోటీలో ఉంటారో తెలియని పరిస్థితి ఉంది. దీంతో ప్రధాని పార్టీ ముఖ్య నాయకుల్లో టెన్షన్ నెలకొంది.



# ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

* వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
* సిసిసి నస్పూర్ ఎస్‌హెచ్‌ఓ యు. ఉపేందర్ రావు

**నస్పూర్, డిసెంబర్ 5, ప్రభాతవార్త**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం పోలీసులు విస్తృత స్థాయి వాహన తనిఖీలు చేపట్టారు. స్థానిక సిసిసి కార్నర్ వద్ద ఎస్‌హెచ్‌ఓ యు. ఉపేందర్ రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా అనుమానాస్పదంగా తిరిగే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డుపైకి వాహనం తీసుకొచ్చే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటి అన్ని రకాల ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. తనిఖీల సమయంలో పత్రాలు చూపించడంలో విఫలమైతే జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఏఎస్ఐలు బషీర్, శకుంతల, పోలీసు సిబ్బంది గోపాల్, వనిత, ఉష, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్, అదనపు పోలింగ్ అధికారుల మొదటి రాండమైజేషన్ పూర్తి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, అదనపు పోలింగ్ అధికారుల మొదటి రాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సాధారణ ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్ సమక్షంలో పోలింగ్, అదనపు పోలింగ్ అధికారుల మొదటి రాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 విడతలలో నిర్వహించనున్న సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నికల కొరకు పోలింగ్, అదనపు పోలింగ్ అధికారుల ల్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ అధికారులను కేటాయించడం జరిగిందని, జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, ఎన్.ఐ.సి. ఇంచార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

# విద్యార్థులకు అందించే పౌష్టిక ఆహారంపై యాప్ ద్వారా పర్యవేక్షణ

**ఆసిఫాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐ.టి.డి.ఎ పరిధిలో గల 4 జిల్లాలు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ లలోని గిరిజన పాఠశాలలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టిక ఆహారంపై ఐటిడిఏ పల్స్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని ఉట్నూర్ ఐటీడీఏ పిఓ యువరాజ్ మర్మాట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయడానికి యాప్ ను ప్రారంభించడం జరిగిందని, ఈ యాప్ ద్వారా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ఫోటోలు యాప్ లో అప్ లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు యాప్ ను ఉపయోగించి ఫొటోస్ అప్లోడ్ చేస్తున్నారని, ఈ ఫోటోలు, వివరాలను నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ యాప్ లో ఏవైనా సమస్యలు ఉన్నచో ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని, ఆహారంలో నాణ్యత, పరిశుభ్రతను నిర్ధారించడానికి ఫోటోలను అప్లోడ్ చేసిన తర్వాత రోజు వారీగా ప్రాజెక్టు అధికారి పేషి స్వయంగా పర్యవేక్షిస్తుందని తెలిపారు.



ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు ఎ.ఐ ద్వారా అప్లోడ్ చేసిన ఆహార పదార్థాలను, వాటి నాణ్యతను పర్యవేక్షించడం జరుగుతుందని, వచ్చే విద్యా సంవత్సరం నుండి పూర్తి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# సాయి ఈశ్వర చారి మృతికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కారణం

## నేడు కలెక్టరేట్ ముట్టడి



మాట్లాడుతున్న బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూపునర్ రమేష్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు కాకపోవడంతో తీవ్రమనస్థాపం చెందిన సాయి ఈశ్వర్ చారి మరణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల హత్యగా భావిస్తున్నామని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూపునర్ రమేష్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర ఫలితంగానే రాష్ట్రంలో రిజర్వేషన్ అమలు కాలేదని సాయిశ్వర్ చారి మరణానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాలని ఆరోపించారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలలో ఉన్నటువంటి బీసీ ప్రజా ప్రతినిధులు వెంటనే పార్టీలకు రాజీనామా చేసి బీసీ ఉద్యమంలో పాల్గొనాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ కు మద్దతు ఇవ్వని నాయకులు బీసీ ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని విరుచుకపడ్డారు. ఈ నెల 6న చేపట్టే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజన వాదులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ మాచర్ల శ్రీనివాస్, బీసీ రైతు సంగం జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతీ పటేల్, బీసీ యువజన సంగం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి సాయి కృష్ణ,బీసీ సంగం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయి కృష్ణ బీసీ సంగం నాయకులు నచర్ల సత్యనారాయణ, అరుణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.